జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో 'తెలంగాణ' సత్తా

● మూడో స్థానంలో నిలిచిన జట్టు.. ఉత్తమ ఆటగాడిగా కెప్టెన్ ప్రేమ్‌దీప్

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రం రోహతక్ జిల్లాలో జరిగిన 43వ సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది. రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న క్రీడాకారుడు దామెర ప్రేమ్‌దీప్ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అత్యంత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి మూడో స్థానంలో నిలిపేందుకు దోహదపడటంతో.. అతనికి ఇండియన్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌లో బెస్ట్ ఆటగాడిగా అవార్డు వరించింది. ప్రేమ్‌దీప్‌కు అవార్డుతో పాటు జ్ఞాపిక అందజేసి సత్కరించినట్లు ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రిక్కుల నారాయణ రెడ్డి తెలిపారు. ప్రేమ్‌దీప్‌ను రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శులు ఎస్.తిరుపతి, ఎం.శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నరసింగం, షార్ప్ స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్, కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, పీఈటీ భాస్కర్ అభినందించారు.

జ్ఞాపిక అందుకుంటున్న తెలంగాణ జట్టు కెప్టెన్ దామెర ప్రేమ్‌దీప్

ప్రతిభకు వేదిక.. కళా ఉత్సవ్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే

చదువుతోపాటు కళల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు భావితరాలకు సంప్రదాయ కళలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎస్‌సీఈఆర్‌టీతో కలిసి రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ 2015 నుంచి ఏటా కళా ఉత్సవ్ పేరిట పలు రకాల పోటీలు నిర్వహిస్తోంది. 2024-25 విద్యాసంవత్సరానికి ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ముందుగా మండలస్థాయిలో పోటీలను నిర్వహించి విజేతలకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి విజేతలకు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

ఆరు విభాగాల్లో

- కళా ఉత్సవ్ పోటీలు గతేడాది వరకు 10 విభాగాల్లో నిర్వహించగా ఈ ఏడాది ఆరు కళలకు సంబంధించి మాత్రమే నిర్వహించనున్నారు.
- స్వర సంగీత, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. వీటిలో ఉప అంశాలుగా గాత్ర, వాద్య సంగీతం విభాగాల్లో హిందుస్థాని, కర్ణాటక తోపాటు ఏదైనా జానపదంలో పోటీలు నిర్వహించనున్నారు. నృత్య విభాగంలో శాస్త్రీయ నృత్యంతోపాటు దేశంలోని ఏ రాష్ట్రానికి సంబంధించిన జానపద నృత్యాన్ని ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తారు. దృశ్య కళా విభాగంలో చిత్ర లేఖనం, శిల్పకళలో పోటీలు ఉంటాయి.
- సంప్రదాయ బొమ్మలు, ఆటలు, నాటికలను, సంప్రదాయ కథలను ప్రదర్శించవచ్చు. గతేడాది ప్రతి విభాగంలో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించగా ఈ ఏడాది ఒక్కో విభాగంలో బాలబాలికలకు కలిపి వ్యక్తిగత, బృంద ప్రదర్శనలకు అవకాశం కల్పించారు.

9వ తరగతి నుంచి ఇంటర్ వరకు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు సంబంధించిన విద్యాలయాల్లో 9, 10, ఇంటర్ చదువుతున్న బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయస్థాయి పోటీలు ఉంటాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు.

మంచి అవకాశం

- ఎస్.యాదయ్య, డీఈవో మంచిర్యాల

వివిధ కళల్లో రాణించే విద్యార్థులకు తమ ప్రతిభను చాటేందుకు కళా ఉత్సవ్ చక్కని వేదిక. ఈ మేరకు మండల, జిల్లా స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్ర, జాతీయ స్థానాల్లో జిల్లా విద్యార్థులు రాణించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.

గతేడాది మంచిర్యాల నుంచి ముగ్గురు జాతీయ స్థాయికి ఎంపిక

గతేడాది నవంబరు 15, 16వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన మంచిర్యాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎన్.బిందుప్రియ(9వ, జడ్పీ హెచ్‌ఎస్, ముత్యంపల్లి), జి.నరేందర్(9వ, జడ్పీ హెచ్‌ఎస్, ముత్యంపల్లి), మనీషాసన(9వ, కస్తూర్బా విద్యాలయం, మంచిర్యాల) జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయిలో ఆయా విభాగాల్లో రత్న కుమార్ ద్వితీయ స్థానం, (జడ్పీ హెచ్‌ఎస్, బజార్‌ఏరియా బెల్లంపల్లి), అమిత్‌కుమార్ తృతీయ స్థానం(9వ, స్లేట్ హై స్కూల్, జన్నారం), జి.రత్న కన్సోలేషన్(కేజీబీవీ, బెల్లంపల్లి) స్థానాల్లో నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నారు.

2023-24 సంవత్సరంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లా విద్యార్థులు

విద్యుత్తు సంస్థలో బదిలీలకు సిద్ధం!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

అన్ని ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీలు దాదాపు పూర్తికాగా. . ప్రస్తుతం విద్యుత్తు సంస్థలో బదిలీల క్రతువు మొదలైంది. ఒకే చోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి బదిలీకి అవకాశం కల్పించారు. కానీ క్యాడర్ మొత్తంలో 50 శాతం మాత్రమే బదిలీ చేయనున్నారు. ఆఫీసు సబార్డినేట్ నుంచి డీఈ స్థాయి వరకు అన్ని క్యాడర్లలో బదిలీలు జరగనున్నాయి. వీటిలో కొన్ని క్యాడర్లు కార్పొరేట్ శాఖ పరిధిలో కాగా మిగతావి జిల్లాలోని ఎస్ఈ, డీఈల పర్యవేక్షణలో బదిలీలు చేస్తారు. ఇప్పటికే బదిలీకి అవకాశమున్న ఉద్యోగుల జాబితాలను జిల్లా సర్కిల్ కార్యాలయం నోటీసు బోర్డుపై, సంబంధిత పోర్టల్‌లో పొందుపర్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలుంటే అక్టోబరు 4వ తేదీలోపు దరఖాస్తులు చేయాలని సూచించారు. ఏడీ, ఏఈ, సబ్ ఇంజినీర్ తదితర స్థాయిల వారు అంతర్జాలంలో, ఇతరులు మ్యానువల్‌గా పోస్టుల ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. 7వ తేదీన బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితాలు విడుదల చేస్తారు. అదే నెల 9వ తేదీ లోపు రిలీవ్ అయి మరుసటి రోజు కొత్త స్థానాల్లో చేరాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జిల్లా విద్యుత్తు శాఖలో క్యాడర్ల వారీగా బదిలీలు ఇలా..

ఏడీ	02
ఏఈ	13
సబ్ ఇంజినీర్	11
జేఏవో	07
సీనియర్ అసిస్టెంట్	08
జూనియర్ అసిస్టెంట్	05
ఫోర్‌మెన్	03
ఎస్ఎల్ఐ	04
ఆఫీసు సబార్డినేట్	04
వాచ్‌మెన్	02
స్వీపర్	02

జిల్లా విద్యుత్తు సంస్థలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొదలవడంతో సందడి నెలకొంది. మొత్తం 11 క్యాడర్లలో 61 మంది ఉద్యోగులు బదిలీ కానున్నట్లు తెలిసింది. జిల్లా పరిధిలో బదిలీ ప్రక్రియ డివిజన్ స్థాయిలో ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు చేపట్టనున్నారు. జేఎల్ఎం, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఎల్ఎం, లైన్‌మెన్, అటెండర్ స్థాయి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ డివిజన్‌లోని డీఈల ఆధ్వర్యంలో పూర్తి చేస్తారు. సర్కిల్ పరిధిలో ఎస్ఎల్ఐ, ఫోర్‌మెన్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, జేఏవో, సబ్ ఇంజినీర్ తదితర ఉద్యోగులకు బదిలీలు ఉంటాయి. సర్కిల్ పరిధిలో జరిగే ప్రక్రియను ఎస్ఈ పర్యవేక్షిస్తారు. జిల్లా క్యాడర్ ఉద్యోగులకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లతోపాటు ఎంఆర్‌టీ డివిజన్, సర్కిల్ ఆఫీసు పరిధిలో ఖాళీలు ఎంచుకోవచ్చు. ఆ పైస్థాయి ఉద్యోగులు ఇతర జిల్లాలనూ ఎంచుకోవచ్చు.

చీకట్లో వార్డులు.. చరవాణి వెలుగుల్లో చికిత్సలు

ఆసిఫాబాద్ జనరల్‌ఆసుపత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనడానికి ఈ చిత్రాలే నిదర్శనం. పలు అసౌకర్యాల మధ్యే రోగులు వైద్య సేవలు పొందాల్సి వస్తోంది. విద్యుత్తు అంతరాయం వార్డులన్నీ చీకట్లు అలుముకుంటున్నాయి. చరవాణి వెలుతురులోనే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితిని సిబ్బంది ఎదుర్కొంటున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే పలుసార్లు ఆసుపత్రిని సందర్శించి అధికారులకు దిశా నిర్దేశం చేసినా.. ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. జనరేటర్ ఆన్ చేయకపోవడంతో రెండు వార్డుల్లోని 21 మంది ఇన్‌పేషెంట్లు చీకటిలో గడిపారు. ఎండతో ఓ వైపు ఉక్కపోత, మరోవైపు దోమలతో తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు వాపోయారు. మధ్యాహ్నం ఆసుపత్రిని పరిశీలించగా.. రోగుల వార్డు చీకటి ఆవరించి కనిపించింది. ఓ నర్సు చరవాణి వెలుతురులో రోగికి

వార్డులో కమ్ముకున్న చీకటి

చరవాణి వెలుతురులో వైద్య సేవలు చేస్తున్న నర్సు

వైద్య సేవలు అందించారు. ఇటీవల భారీ వర్షంతో విద్యుత్తు అంతరాయం ఏర్పడితే రాత్రంతా రోగులు చీకటిలోనే గడిపారు. దీంతో కొందరు ప్రజా సంఘాల సభ్యులు ఆసుపత్రి వద్ద రాత్రి ధర్నా చేయడంతో స్పందించిన అధికారులు ఇంధనం తెప్పించి జనరేటర్‌లో ఆన్ చేశారు.

- న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

జాతీయ రహదారిపై అడ్డంగా పశువులు

సహజ 'వేగ నిరోధకాలు'!

రహదారులపై పశువులు ఇష్టానుసారంగా తిరుగుతూ అక్కడే తిష్ఠవేస్తుండటంతో.. ప్రమాదాలకు కారకాలుగా మారుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు వీటిని చూసి నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుండటంతోపాటు ఒక్కోసారి గమనించకుంటే ఇబ్బందులు పాలవుతున్నారు. మండల కేంద్రం గుండా వెళ్లే నాలుగు వరుసల రహదారితోపాటు సర్వీసు రహదారులపై పశువులు సంచరించడం, సేద తీరుతున్నాయి. పశువుల యజమానులు ఏమీ పట్టనట్లుగా వదిలేస్తున్నారు. వీటిని గమనించక పలుమార్లు ద్విచక్రవాహనదారులు గాయాలపాలైన ఘటనలున్నాయి. పెద్ద ప్రమాదాలు చోటు చేసుకోక ముందే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పశువులు రహదారులపై సంచరించకుండా యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శి శివకుమార్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకు వెళ్లగా. . చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, వాంకిడి**

మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి

ఆసిఫాబాద్, వాంకిడి, న్యూస్‌టుడే : వాంకిడి మండలం సవాతి, దాబా పంచాయతీల మధ్య దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేశారని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద నీటి కారణంగా భగీరథ పైప్‌లైన్ దెబ్బతిన్నాయని, సంబంధిత గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచి ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. డీఎల్‌పీవో, పీఆర్ ఈఈ, మండల పంచాయతీ అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కరించినట్లు పేర్కొన్నారు. తాగునీటి సరఫరా పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసినట్లు చెప్పారు.

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పంటల కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చర్యలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందించాం. పత్తి, సోయా తదితర పంట ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. వ్యాపారులు, దళారులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు పి.శ్రీనివాస్ హెచ్చరించారు. పత్తి, సోయా, ఇతర పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు తమ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఆయనతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలివిగో..

'న్యూస్‌టుడే' ముఖాముఖిలో
● మార్కెటింగ్ శాఖ జేడీ పి.శ్రీనివాస్

ప్రశ్న : పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు : ఉమ్మడి ఆదిలాబాద్‌లో 24 కేంద్రాలు ఉన్నాయి. మార్కెట్ల వారీగా క్రయవిక్రయాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల వారీగా మార్కెట్ సిబ్బందితో ఏర్పాట్లు, ఇబ్బందులు తదితర వాటిపై చర్చించాం. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించాం.

? : ఏటా పత్తి కొనుగోలులో తేమ శాతం నిర్ధారణలో సీసీఐ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది?

✔ : ప్రభుత్వ నిబంధనల మేరకు పత్తిలో 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర చెల్లిస్తారు. అంతకంటే ఎక్కువ ఉంటే ఒక శాతానికి కిలో ధర కోత ఉంటుంది. ఇలా 12 శాతం తేమ వరకు సీసీఐ కొనుగోలు చేస్తోంది. తేమ శాతాన్ని మూడు సార్లు తీసుకొని, సగటు తేమను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పాం. ప్రారంభంలో సహజంగానే తేమ ఎక్కువగా ఉంటుంది. రైతులు పత్తిని ఆరబెట్టుకొని తీసుకొస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

? : పత్తి సాగు పెరిగిన నేపథ్యంలో ఈ సీజన్‌లో ఎక్కువగా వస్తుందని అంటున్నారు?

✔ : గతేడాది 28.72 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా 20 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వచ్చింది. ఈ సీజన్‌లో 22.58 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వస్తుందని అంచనా.

? : పత్తి క్రయవిక్రయాల్లో సీసీఐ, వ్యాపారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి?

✔ : సమగ్ర సర్వే ఆధారంగా ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్న రైతుల నుంచి మాత్రమే పంటను కొనుగోలు చేస్తారు. రైతులు ఇతరులకు తమ పట్టాపాసు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు ఇవ్వొద్దు. దళారులు, వ్యాపారులు ఎవరైనా ప్రభుత్వాన్ని మోసగించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవు.

? : పంట నిర్ధారణలో ఏటా రైతులు ఇబ్బందులు పడుతున్నారు? తిరిగి మార్కెట్లో బారులు తీరి నిలబడాల్సి వస్తోంది?

✔ : పంట కొనుగోలులో వ్యవసాయ శాఖ చేపట్టిన పంటల సమగ్ర సర్వే వివరాలను ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఆధార్ నెంబరుతో రైతు ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశాడనేది తెలుస్తుంది. పత్తిలో ఎకరానికి 12 క్వింటాళ్లు, సోయాలో ఆరు క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. మార్కెట్‌కు వచ్చిన తర్వాత ఇబ్బంది కలగకుండా ఆధార్‌తో రైతు ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశాడనేది ముందే తెలుసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

? పంటను కొనుగోలు చేస్తున్నా.. డబ్బులు సకాలంలో ఇవ్వడం లేదంటున్నారు?

✔ : పత్తిని సీసీఐ, సోయాను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తోంది. వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. పంటను విక్రయించే రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఉన్నది లేనిది ముందే తెలుసుకుంటే ఇబ్బందులు ఉండవు.

వేతనం ఇవ్వడం లేదని రైతు వేదికకు తాళం

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రపూర్ గ్రామ రైతు వేదికకు భూమి దానం చేసిన రైతు దుర్గం వెంకటి.. ఆదివారం రైతువేదికకు తాళం వేసి నిరసన తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ప్రభుత్వ హయాంలో రైతువేదిక నిర్మాణం కోసం స్థలం ఇస్తే సంబంధిత భూ యజమానికి అటెండర్ ఉద్యోగంతోపాటు, దాత తల్లిదండ్రుల పేర్లు శిలాఫలకంపై ముద్రిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పారు. అయితే తన తల్లిదండ్రుల పేర్లను ముద్రించకుండా, నాలుగేళ్ల నుంచి అటెండర్‌గా పనిచేస్తున్నా వేతనం ఇవ్వడం లేదని బాధిత రైతు ఆందోళనకు దిగారు. దీంతో వేదికకు తాళం వేసినట్లు పేర్కొన్నారు. తనకు వేతనం అందించకుంటే మరణం తప్ప మరో దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా.. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

రుద్రపూర్ రైతు వేదికకు తాళం వేస్తున్న బాధితుడు

సింగరేణిలో పనిచేసే వారి సంక్షేమంతోపాటు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం అనేక సదుపాయాలు కల్పిస్తోంది. ఆటలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందనే ఉద్దేశంతో..

అందుబాటులో మెరుగైన క్రీడా సౌకర్యాలు సమకూర్చుతోంది. వాటిని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఫలితంగా నిరుపయోగంగా మారుతున్నాయి.

ఉద్యానవనం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే

వసతులు ఘనం..

వినియోగించుకుంటేనే ఫలితం

బెల్లంపల్లి ఏరియా ప్రాంతంలో బొగ్గు గనులు కొనసాగుతున్న క్రమంలో అధికారులు, కార్మికులు, వారి పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం క్రీడా మైదానాలు, ఇండోర్ గేమ్స్ ఆడుకోవడానికి ఏర్పాట్లు చేసి సామగ్రిని అందుబాటులో ఉంచింది. అప్పట్లో ఏరియాలో గోలేటి-1 ఇంక్లైన్, గోలేటి-1ఏ ఇంక్లైన్ భూగర్భ గనితోపాటు ఖైరిగూర ఓసీపీ, డోర్లి-1, డోర్లి-2, బీపీఏ ఓసీపీ-2 ఓపెన్ కాస్టులు నడుస్తున్న క్రమంలో అయిదు వేలకు పైగా ఉద్యోగులు ఉండేవారు. కాలక్రమేణా రెండు భూగర్భ గనులతో పాటు డోర్లి-1, 2, బీపీఏ ఓసీపీ-2 ఓపెన్‌కాస్టులు మూత పడ్డాయి. ప్రస్తుతం ఒక ఖైరిగూర ఓసీపీ మాత్రమే కొనసాగుతోంది. ఉద్యోగుల సంఖ్య 1100లకు పడిపోయింది. యాజమాన్యం కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన క్రీడా స్థలాలకు అనుకున్న స్థాయిలో క్రీడాకారులు రాక పోవడంతో బోసిపోతున్నాయి.

గోలేటి శ్రీభీమన్న మైదానం

ఈత కొలను

ఇవీ సౌకర్యాలు..

గోలేటి శ్రీభీమన్న మైదానం, అందులోనే వాలీబాల్ కోర్టు, బాస్కెట్‌బాల్, క్రికెట్, లాన్‌టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేశారు. గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఉడెన్ షటిల్ కోర్టు, టేబుల్‌టెన్నిస్, క్యారమ్, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికను నెలకొల్పారు. సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులు తీర్చిదిద్దారు. వ్యాయామం కోసం గోలేటి సీఈఆర్ క్లబ్ ఆవరణలో జిమ్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. ఆఫీసర్ క్లబ్‌లో ఇండోర్ షటిల్ కోర్టు, ధ్యానం కోసం రెండు పిరమిడ్ కేంద్రాలు, సేవా సమితి ఆధ్వర్యంలో మహిళల కోసం కుట్టుమిషన్లు, ఎంబ్రాయిడరీ కేంద్రాలు అందుబాటులో ఉంచారు. ఆహ్లాదకరమైన వాతావరణ కోసం శ్రీకోదండ రామాలయం ఎదుట ప్రత్యేకంగా ఉద్యానవనం ఏర్పాటు చేసి పిల్లల కోసం ఆట వస్తువులను అమర్చారు.

గోలేటి నుంచి జాతీయస్థాయికి..

గోలేటి గ్రామం చిన్నదే అయినప్పటికీ ఎంతో మంది పలు క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించారు. బెల్లంపల్లి ఏరియా ఉద్యోగులు కోలిండియా స్థాయిలో పసిడి పతకాలు కొల్ల గొట్టారు. గోలేటి సింగరేణి పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువగా క్రీడల్లో ప్రతిభ కనబరుస్తుంటారు. ఇక్కడి నుంచి స్పోర్ట్స్ కోటాలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విజయ్ రైల్వేశాఖలో, సిద్ధార్థరాజ్ అనే క్రీడాకారుడు పోస్టల్ డిపార్టుమెంటులో ఉద్యోగాలు సాధించారు. మరికొంత మంది స్పోర్ట్స్ కోటా ఎంబీఏలో సీటు పొందారు. ఈ గ్రామం నుంచి వివిధ క్రీడల్లో దాదాపు 100 మందికి పైగా క్రీడాకారులు జాతీయస్థాయికి పరిచమయ్యారు.

◆ స్కాట్స్ అండ్ గైడ్స్‌లో గోలేటి సింగరేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రపతి, గవర్నర్ అవార్డులు సొంతం చేసుకున్నారు. అయితే బొగ్గు గనులు తగ్గడంతో కార్మికుల సంఖ్య తగ్గింది. దీంతో అందుబాటులో అన్ని సౌకర్యాలున్నా.. ఎక్కువ మొత్తంలో ఆడే వారు దూరమయ్యారు. జిల్లా, రాష్ట్ర స్థాయి, సింగరేణి క్రీడల సమయంలో మాత్రం ఆట స్థలాలు కళకళలాడుతుంటాయి. మిగతా సమయంలో తక్కువగా కనిపిస్తుంటారు. యాజమాన్యం అందుబాటులో ఉంచిన మైదానాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు, యువత క్రీడల్లో రాణిస్తే గోలేటికి మరింత పేరు వచ్చే అవకాశం ఉంటుంది.

(c) eenadu

దసరాకు 412 ప్రత్యేక బస్సులు

● ప్రయాణికుల చేరవేతకు ఆర్టీసీ కార్యాచరణ

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ : దసరా, బతుకమ్మ పండగల నేపథ్యంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసింది. సంస్థకు ఆదాయాన్ని పెంచడంతో పాటు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య భారీగా పెరిగింది. గతంలో రోజుకు సగటున 1.50 లక్షల మంది ప్రయాణిస్తే మహాలక్ష్మి పథకం తర్వాత అది 2.75 లక్షలకు చేరుకుంది. అందులో మహాలక్ష్మి ప్రయాణికులే 1.50 లక్షల మంది ఉండటం గమనార్హం. సగటున 90 శాతం ఆక్యుపెన్సి రేషియో(బస్సులో సీట్లు, ప్రయాణికుల నిష్పత్తి) నమోదవుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆదిలాబాద్ రీజియన్ వ్యాప్తంగా ఆరు డిపోల పరిధిలో 412 బస్సులను హైదరాబాద్‌కు నడిపేందుకు సిద్ధమైంది.

అక్టోబరు 1 నుంచి సర్వీసులు ప్రారంభం

ప్రభుత్వం పండగల నేపథ్యంలో అక్టోబరు 2 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. కళాశాలల్లో చదివే విద్యార్థులు, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్న వేలాది మంది పండగకు సొంతూళ్లకు పయనమవుతారు. వారిని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు 1 నుంచి 11 వరకు రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి డిపోలకు రాకపోకలు సాగించేందుకు 412 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఇందులో 120 బస్సులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపనున్నారు. సూపర్ లగ్జరీ, గరుడ, లహరి బస్సులు 282 వరకు నడపనున్నారు. పండగ తర్వాత తిరుగు ప్రయాణంలో మళ్లీ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడపేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

- సోలోమన్, ఆర్టీసీ రీజనల్ మేనేజరు

దసరా, బతుకమ్మ పండగలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులను హైదరాబాద్ నుంచి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆరు డిపోల పరిధిలో 412 బస్సులను ఏర్పాటు చేశాం. తిరుగు ప్రయాణంలో సైతం రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి.

నవరాత్రి ఉత్సవాల వేళ బాసరలో ఆర్జిత సేవలు నిలిపివేత

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతి మాత ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో జరిగే పలు ఆర్జిత పూజలను నిలిపివేస్తున్నట్లు ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావు తెలిపారు. వచ్చే నెల 3 నుంచి 11వ తేదీ వరకు అభిషేకం ఉండదని చెప్పారు. 9న అమ్మవారి మూల నక్షత్రం సందర్భంగా వేకువజాము నుంచి సాయంత్రం వరకు అక్షరాభ్యాసాలు తప్ప మిగతా ఆర్జిత సేవలేవీ ఉండవని చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా వీఐపీ పాస్‌లను అనుమతించమని పేర్కొన్నారు. 11,12,13 తేదీల్లో ఆలయంలో చండీహోమం నిర్వహించబోమని తెలిపారు. 9వ తేదీన దసరా రోజున ఉదయం 10 గంటల తర్వాత అక్షరాభ్యాసాలు చేయిస్తామని చెప్పారు.

ఆత్మరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ఆత్మరక్షణకు తగిన ప్రాధాన్యమివ్వాలని, ఇందుకు కరాటే వంటి యుద్ధవిద్యను నేర్చుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. చుక్క ధర్మరాజ్ స్మారకార్థం నిర్మల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 1,200 మంది క్రీడాకారులు పలు విభాగాల్లో పోటీపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే కరాటేలో శిక్షణ పొందడం వల్ల మానసికంగా, శారీరకంగా చురుకుగా తయారవుతారన్నారు. వచ్చిన క్రీడాకారులందరినీ అభినందించారు. అనంతరం పోటీలు జరిపి విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. న్యాయనిర్ణేత రాపోలు సుదర్శన్, వైద్యుడు ఉప్పు కృష్ణంరాజు, తేజేందర్ సింగ్, కొండాజి శ్రీకాంత్, భూషణ్, స్వామి, సాయికృష్ణ, మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం: జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-15 బాలబాలికల చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన క్రీడల అధికారి కె.పార్థసారథి హాజరై మాట్లాడుతూ.. మనిషి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు చదరంగం ఆట ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబరు 29న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పోటీల నిర్వాహకుడు నన్నపు స్వామి, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీఈటీలు వినోద్, సాయి, నాగిరెడ్డి, కృష్ణచైతన్య తదితరులు ఉన్నారు.

చదరంగం ఆటలో బాలికలు

ఆరోగ్య "ప్రశస్తి"

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే చదువుకోగలుగుతారు. అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విద్యార్థుల్లోని మానసిక, శారీరక లోపాలతోపాటు అభ్యసన లోపాలు గుర్తించి వైద్యం అందిస్తే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది. ఇందులో భాగంగా లోపాలు గుర్తించి బాధిత విద్యార్థులకు సరైన వైద్యం అందించాలనే లక్ష్యంతో 'ప్రశస్త్' అనే ప్రత్యేక యాప్‌ను విద్యాశాఖ రూపొందించింది. అయితే ఉపాధ్యాయులే తమ దగ్గర చదువుకుంటున్న పిల్లలను నేరుగా పరీక్షించి వారిలోని లోపాలను ఇందులో నమోదు చేయనున్నారు. వీటి ఆధారంగా అధికారులు బాధిత విద్యార్థులకు సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

-న్యూస్‌టుడే, దండేపల్లి, బేల

● విద్యార్థుల్లోని లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

నమోదు ఇలా..

ముందుగా అన్ని పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ చరవాణిలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపాధ్యాయులు తమ పేరు, పని చేస్తున్న పాఠశాల, మొబైల్ సంఖ్య, ఐడీ తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఆ తర్వాత విద్యార్థుల పేర్లు, ఒక్కో విద్యార్థిని పరీక్షించి వివరాలు నమోదు చేస్తారు.

64 ప్రశ్నలు

ఉపాధ్యాయులు తమ చరవాణిలో విద్యార్థులకు సంబంధించి 64 ప్రశ్నలుంటాయి. వీటికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

పార్ట్ 1లో

శిక్షణ పూర్తయిన దగ్గర నుంచి అక్టోబరు 26 వరకు కొనసాగనుంది. ఈ యాప్‌లో ఉండే విద్యార్థికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో విద్యార్థులను పరిశీలించాలి. శారీరక, మానసిక సమస్యలతోపాటు బాగా చదువుతున్నాడా, అక్షరాలు గుర్తు పడుతున్నాడా, నత్తిగా మాట్లాడటం, చిన్న చిన్న విషయాల్లో సైతం వెనుకబడి ఉంటున్నాడా తదితర అంశాలు గమనించి నమోదు చేయాలి.

విద్యార్థుల నమోదుపై శిక్షణ పొందుతున్న రిసోర్స్‌పర్సన్లు

పార్ట్ 2లో

అక్టోబరు 27 నుంచి నవంబరు 14 వరకు దీన్ని కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని గుర్తించి పరిశీలిస్తారు. వైద్యులకు నివేదిస్తారు. దీని ఆధారంగా వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తారు.

పకడ్బందీగా అమలు

ఎస్.యాదయ్య, జిల్లా విద్యాధికారి, మంచిర్యాల

ప్రశస్త్ యాప్‌ను పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఉపాధ్యాయులందరూ తమ విద్యార్థుల వివరాలు నమోదు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం.

శిక్షణ పూర్తి :

ఇందుకోసం ప్రతీ మండలానికి ఒక రిసోర్స్‌పర్సన్‌ను ఎంపిక చేశారు. వీరికి జిల్లాల కేంద్రాల్లో ఇప్పటికే శిక్షణ అందజేశారు. వీరు మండల, కాంప్లెక్స్ కేంద్రాల్లో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వివరాలు నమోదు చేసేలా చూడాలి.

ఉమ్మడి జిల్లాలో వివరాలు

ఆదిలాబాద్	1,432 / 1,25,280
కుమురంభీం	1,248 / 85,970
మంచిర్యాల	1,044 / 1,04,387
నిర్మల్	1,034 / 1,11,836

● జిల్లా ● పాఠశాలలు ● విద్యార్థులు

మూడో వర్గానికి ఇక గుర్తింపు

● ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు పొందిన వారు తాము ఏ జెండర్‌గా గుర్తించుకుంటున్నారో అది పొందే హక్కు ఉంటుంది. ఇందుకోసం దరఖాస్తు చేసేందుకు కేంద్రం ట్రాన్స్‌జెండర్ నేషనల్ పోర్టల్ (http:///transgender.dosje.gov.in)ను ప్రవేశపెట్టింది. ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలి. అది నేరుగా సంబంధిత జిల్లా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి మహిళా శిశు సంక్షేమ శాఖలోని సీడీపీవోలకు పంపిస్తారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అర్హులైతే ఆమోదించి కలెక్టర్‌కు నివేదిస్తారు. అనంతరం గుర్తింపు కార్డు జారీ చేస్తారు.

ఆర్థిక పునరావాస పథకంతో ప్రయోజనాలు..

సాధారణంగా ట్రాన్స్‌జెండర్లకు ఇళ్లు అద్దెకిచ్చేందుకు చాలా మంది నిరాకరిస్తుంటారు. పనిలో చేర్చుకునేందుకు వెనుకడుగు వేస్తుంటారు. అధికారికంగా కార్డు జారీ కావడంతో.. సమాజంలో వారికి ఓ గుర్తింపు వస్తుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందొచ్చు. వారితో భిక్షాటన మాన్పించి స్వయం ఉపాధితో గౌరవప్రద జీవనం సాగించేలా 'ఆర్థిక పునరావాస పథకం' అమలు చేస్తున్నారు. కుట్లు, అల్లికలు, ఫ్యాషన్, ఎంబ్రాయిడరీ, మొబైల్ రిపేరింగ్, ఆరోగ్య సేవలపై.. ఇలా వారికిష్టమైన రంగాల్లో రాణించేలా శిక్షణ ఇచ్చేలా చూస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కొలువుల్లోనూ వివక్ష లేకుండా ఉంటుంది. ఇప్పటికే ఈ పథకం కింద కుమురంభీం జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు.. ఇద్దరికి రూ.50 వేల చొప్పున కలెక్టర్ చెక్కులు అందించారు. జిల్లాలో ఇప్పటి వరకు 24 మందికి గుర్తింపు కార్డులు అందుకోగా.. మరో 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఇలాంటి వారు సుమారు 70-80 మంది వరకు ఉండవచ్చని అధికారుల అంచనా. కానీ సరైన అవగాహన లేక దరఖాస్తులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే :

ఏళ్లుగా ట్రాన్స్‌జెండర్లు సమాజంలో వివక్షకు గురవుతున్నారు. సరైన ఉపాధి అవకాశాలు దొరకక నగరాలు, పట్టణాల్లో భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇలాంటి వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కార్డుల జారీకి ఉపక్రమించింది. గత ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం-2019 తీసుకొచ్చినా.. చాలా మందికి దీనిపై సరైన అవగాహన లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి గుర్తింపు కార్డులున్న వారికి స్వయం ఉపాధి కోసం శిక్షణలు, ఆర్థికసాయం, వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ ద్వారా వీరి బాగోగులు చూస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు గుర్తింపు పత్రం అందిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవికుమార్

జిల్లాల వారీగా కార్డులు ఇలా..

	జిల్లా	జారీ చేసిన కార్డులు	పరిశీలనలో ఉన్నవి
కుమురంభీం	24	10	
నిర్మల్	15	32	
ఆదిలాబాద్	23	07	
మంచిర్యాల	15	01	

రూ.50 వేలతో చిరు వ్యాపారం

- సౌజన్య, ట్రాన్స్‌జెండర్, కాగజ్‌నగర్

స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించింది. దీంతో చిన్న కిరాణా కొట్టు పెట్టుకున్నాం. ఈ నిధులు దేనికీ సరిపోవడం లేదు. ఇంకాస్త పెంచి ఇస్తే బాగుంటుంది. మరింత మందికి సాయం అందించి ఉపాధి చూపాలి.

వైద్య సేవలకు మైత్రీ ట్రాన్స్‌క్లినిక్‌లు..

చర్మ, సుఖ వ్యాధులు.. వివిధ ఆరోగ్య సమస్యలు ఎదురైనపుడు కొందరు వైద్యులు సేవలందించేందుకు వెనుకడుగు వేస్తున్నారని ట్రాన్స్‌జెండర్లు ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదని తెలిసింది. ఇలాంటివి అధిగమించేందుకు ప్రతి జిల్లాలో మైత్రీ ట్రాన్స్‌క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో వారానికి ఒక రోజు వైద్య సేవలు, కౌన్సెలింగ్ ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ట్రాన్స్‌జెండర్‌కే ఆరోగ్య సేవలపై శిక్షణ ఇచ్చి వీటిలో నియమించనున్నారు. ఒక ప్రత్యేక వైద్యుడిని నియమించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో దీని కోసం ప్రత్యేక గదిని కేటాయించారు. త్వరలో సీఎం అన్ని జిల్లాలో వర్చువల్ విధానంలో వీటిని ప్రారంభిస్తారని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- పి.రవికుమార్, జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి

ట్రాన్స్‌జెండర్ల పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటే వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ద్వారా పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తాం. కార్డు జారీ అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందొచ్చు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

అలా చూస్తారు.. ఇలా చిత్రిస్తారు

బీఆర్ అంబేడ్కర్ చిత్రం

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: చిత్రాలు గీయడం అందరికి సాధ్యం కాదు. కొందరు వెన్నతో పెట్టిన విద్యగా అలవోకగా చిత్రిస్తారు. ఆ కోవలోనే నిర్మల్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన యువ చిత్రకారిణిగా దుమ్మ శ్రావణి రాణిస్తున్నారు. చిన్నప్పటి నుంచి రాత పుస్తకాల్లో బొమ్మలు వేయడం ఆమెకు అలవాటుగా మారింది. ఏదైనా చిత్రం కన్పిస్తే అచ్చుగుద్దినట్లు బొమ్మగీసేస్తారు. బీఆర్ అంబేడ్కర్, అబ్దుల్ కలాం, మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, స్వామి వివేకానందుడు వంటి మహనీయుల చిత్రాలను పెన్సిల్‌తో గీశారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, తదితరుల చిత్రాలు సైతం అలవోకగా గీస్తూ మెప్పిస్తున్నారు. ఫొటోలు చూసి అలాగే ఉన్నది ఉన్నట్లు గీస్తారు. ఇంటి గోడలపై నెమలి, పువ్వులు, ప్రకృతి అందాలు, గోడలపై అల్లికలతో ఆకృతులు అనేక రకాల చిత్రాలు రంగు పెన్సిల్‌తో గీస్తున్నారు. జన్మదినాలు, వివాహాది శుభకార్యాలకు బహుమతులు ఇచ్చే వారు శ్రావణికి ముందు చెబితే ఎలాంటి చిత్రాన్ని అయినా పెయింటింగ్ చేసి ఇస్తున్నారు. ఆమె చేతి నుంచి రూపుదిద్దిన చిత్రాలు చూసిన పలువురు అభినందిస్తున్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రం

నెమలిని చిత్రిస్తున్న యువ చిత్రకారిణి శ్రావణి

EENADU eClassifieds

BUSINESS SERVICES

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ప్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

JOBS

Wanted: Sales Executive (Experience & Fresher also), Technician ITI Diesel Mechanical (For Good Salary Experience in Automobiles), Spare Parts Incharge (Experience), Service Advisors - 02 (Experience). From Prakash Hyundai Car Showroom, Mancherial Branch Gadderagadi, Contact numbers: For Sales: 88866 36885, 90149 40949, For Service: 99632 18395, 85558 49596.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నుండి పుత్తడిను/ పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad: 99590 97631
90005 66042

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99590 97631
90005 66042
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80083 42688

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలోని ఓ విద్యార్థి తాను ఇంటికి వెళ్లడానికి ఔట్‌పాస్ ఇవ్వడం లేదని ఏకంగా డయల్ 100కు ఫోన్ చేశాడు. బాసర పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని విశ్వవిద్యాలయం అధికారులతో మాట్లాడారు. దసరా పండగకు రెండు రోజుల్లో అందరికీ సెలవులు ఇస్తామని, ఇప్పుడు ఇవ్వడం కుదరని వారు చెప్పారు. ఇదే విషయాన్ని విద్యార్థికి పోలీసులు వివరించారు.

ఔట్‌పాస్ ఇవ్వడం లేదని డయల్ 100కు విద్యార్థి ఫోన్

నేటి నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

ఈనాడు, కరీంనగర్:

● పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి సమరం

విభాగం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉపాధ్యాయ	15,892	7,322	–	23,214
పట్టభద్రులు	1,35,218	61,077	26	1,96,321

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే కలెక్టర్లు నమోదుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశముంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌లు(జూనియర్ లెక్చరర్లు), డీఎల్‌లు(డిగ్రీ లెక్చరర్లు), యూజీసీలో నమోదైన ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అవకాశం ఉంటుంది.

డిసెంబరు 30న తుది జాబితా

ప్రస్తుతం ఈ స్థానం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కె.రహోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో వీరి పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది నవంబరు మొదటి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం విధి విధానాలను జిల్లాలకు పంపించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. సవరణలు, ఆక్షేపణలకు గడువు ఇచ్చి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా వెల్లడించనున్నారు.

కొత్తగా నమోదు చేసుకోవాల్సిందే

దాదాపు అయిదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసిన వారంతా తిరిగి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. అప్పుడు ఓటేసినా.. వేయకున్నా ఇప్పుడు మళ్లీ కొత్త జాబితానే అధికారులు రూపొందిస్తారు. దీని ప్రకారమే త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముంది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ ఓటర్లున్నారు. ఈ సారి 15 జిల్లాల పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయ ఓటును నమోదు చేసుకోవాలి. ఫారమ్-18 ద్వారా వివరాలు నమోదు చేసి నేతావో తెలంగాణ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. డిగ్రీ మార్కుల మెమోతో పాటు ఆధార్ సహా ఇతర పత్రాలను జోడించాలి. పత్రాలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలి. 2021 నవంబరులోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చు. మరోవైపు ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసేవారు కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి నమోదుకు శ్రీకారం చుడుతున్నారు.

వైద్యం వికటించి వివాహిత మృతి

శ్రీలత

నస్పూర్, న్యూస్‌టుడే: పీఎంపీ వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్ పురపాలిక నాగార్జునకాలనీలోని సింగరేణి క్వార్టర్‌లో నివాసం ఉండే చింతం రాజు భార్య శ్రీలత(24)కు శుక్రవారం జ్వరం వచ్చింది. జ్వర తీవ్రత ఎక్కువ కాగా రాపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ మూడేళ్లుగా స్థానికంగా పీఎంపీగా ప్రాక్టీస్ చేస్తుండగా శనివారం అతడిని పిలిచాడు. మొదట ఆమెకు సెలైన్ ఎక్కించాడు. చలి తీవ్రత ఎక్కువ కావడంతో మధ్యలోనే సెలైన్ తొలగించి ఓ ఇంజక్షన్ ఇచ్చాడు. వైద్యం వికటించి ఆమె వాంతులు, మల, మూత్ర విసర్జన చేసుకోవడంతో భర్త మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. అనంతరం మృతి చెందారు. ఈ మేరకు పీఎంపీ వైద్యుడు ప్రశాంత్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

కుమార్తె పుట్టిన రోజున..

వీరి అయిదేళ్ల కుమార్తె అన్విత పుట్టిన రోజు శనివారం కావడంతో సంతోషంగా జన్మదిన వేడుకలు జరుపుకోవాలనుకున్నారు. అంతలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

(కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే)

? వల్లకొండ పంచాయతీలోని సీతానగర్‌లో నిత్యం విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. పంచాయతీకి విద్యుత్తు బిల్లుల భారం పడుతోంది. - వినోద్, స్థానికుడు

✔ రెండ్రోజుల్లోగా ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. -రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్

ఆకసం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి

రచయిత, ఉద్యమకారుడు రేగుంట కేశవరావును సత్కరిస్తున్న ఆకసం ప్రతినిధులు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తెలుగు జాతి గర్వించదగ్గ ప్రముఖ కవి గుర్రం జాషువ జయంతి కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ కవుల సంగము(ఆకసం) ఆధ్వర్యంలో శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆదర్శాలను కొనియాడుతూ కవి సమ్మేళనం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన కవి, ఉద్యమకారుడు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు రేగుంట కేశవరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాషువా దళిత కవిగా సమాజంలో మార్పు కోసం గబ్బిలం కావ్యాన్ని రాశారని తెలిపారు. కుల వివక్షను రూపుమాపడానికి కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. కవులు తమ కవితలతో అలరించారు. ఆకసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లగొండ రమేశ్, శ్రీరాం సత్యనారాయణ, గౌరవ సలహాదారులు అవధాని మాడుగుల నారాయణమూర్తి, గుర్రాల వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణచారి, కవులు నాగోరావు, మధుకర్‌శర్మ, డిల్లీ విజయ్‌కుమార్, రేవతి, స్వప్న, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

చిన్నారిని అప్పగిస్తున్న ఈఎంటీ సాగర్

కాగజ్‌నగర్ గ్రామీణం, బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని బారేగూడకు చెందిన గర్భిణి కడతల సరోజనకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో బెజ్జూరు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రసవం కాకపోవడంతో 108 వాహనంలో కాగజ్‌నగర్‌కు తరలిస్తున్న క్రమంలో కడంబా-ఆట్‌పల్లి గ్రామాల మధ్యలో ప్రసవమైనట్లు ఈఎంటీ సాగర్, పైలట్ మహేష్ తెలిపారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, కాగజ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు.

ఏచూరి లేని లోటు పూడ్చలేనిది

సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం సాయంత్రం ఆయన సంస్మరణ సభ నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలోనే అనేక ఉద్యమాలు, పోరాటాల గురించి అధ్యయనం చేస్తూ కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల సాధన, రాజ్యాంగ రక్షణకు పోరాటం చేశారని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ, వివిధ సంఘాల నాయకులు మేడి చరణ్‌దాస్, వైద్య శాంతికుమారి, కటుకం మధూకర్, జాడి కేశవ్, తౌటం శ్యాంసుందర్, ఖమర్, రాజ్‌కమలాకర్‌రెడ్డి, మహిపాల్, సుందిళ్ల రమేష్, విస్తారు, మోహన్, ముజాములుద్దిన్, ఆనంద్‌కుమార్, జయదేవ్, ఓదెలు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని కోరారు. పీఆర్‌సీ బకాయిలు విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఆరోగ్య కార్డులు జారీ చేయాలని, పదవీ విరమణ సాయం, రూ.25 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, రెండో ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, కోశాధికారి సునిత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెండో ఏఎన్ఎంలు

బకాయిలు విడుదల చేయాల్సిందే

సీఆర్టీ ఉపాధ్యాయులతో పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు టి.శ్యాంసుందర్, నాయకులు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలోని గిరిజన గ్రామాల్లో విద్యార్థులకు చదువులు చెబుతున్న సీఆర్టీ ఉపాధ్యాయులకు నాలుగు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు తౌటం శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సీఆర్టీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సీఆర్టీలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. పీఆర్టీయూ తెలంగాణ ఆసిఫాబాద్ మండలశాఖ అధ్యక్షులు దుర్గం మారుతి, సీఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షులు కొమరెల్లి శంకర్, ఉపాధ్యక్షులు కుర్సెంగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జరుపుల విజేశ్, నాయకులు గోగర్ల ప్రవీణ్, చేతన్, విజయలక్ష్మి, ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండల కేంద్రం మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై నాలుగు వాహనాల్లో 36 పశువులను ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. విచారణలో బెజ్జూర్ నుంచి జగిత్యాల జిల్లాలోని రాజారాంపల్లి పశువుల సంతకు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు చెప్పారు. ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

వాహనంలో పశువులు

పోరుగడ్డ రోడ్డుకు అడ్డంకులా?

బాబేఝరి సమీపంలో..

ఏటా ఇదే పరిస్థితి..

చేసిన రోడ్డు పనుల్లో నైతం నాసిరకంగా ఉండటంతో.. నిత్యం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జోడేఘాట్ వెళ్లే మార్గంలో.. పట్నాపూర్, బాబేఝరి సమీపంలోని కల్వర్టు ఏటా వానాకాలంలో కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారుతోంది. భీం వర్ధంతి సందర్భంగా తూతూమంత్రంగా ఇక్కడ మట్టి వేసి పనికానిచ్చేస్తున్నారు. తర్వాత షరా మామూలుగా పరిస్థితి ఉంటోంది. ఇక్కడ శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీలు కోరుతున్నారు.

చిన్న పట్నాపూర్ సమీపంలో కల్వర్టు దుస్థితి

న్యూస్‌టుడే, కెరమెరి

నాడు జల్, జంగల్, జమీన్ నినాదాలతో ఆదివాసీల అస్థిత్వం కోసం నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన కుమురం భీం పుట్టిన గడ్డకు వెళ్లేందుకు అటవీ అనుమతులు అడ్డొస్తున్నాయి. ఏళ్ల తరబడి రాకపోవడంతో.. గతుకుల దారిపై అవస్థల ప్రయాణం చేయాల్సిన దుస్థితి. జోడేఘాట్ వెళ్లే మార్గంలో రోడ్డు అనుమతి కోసం ఇప్పటికీ ఆదివాసీలు పోరాటాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

కేవలం అయిదు కిలోమీటర్లు..

2015లో కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు రూ.15 కోట్లతో రెండు వరుసల రోడ్డు మంజూరైంది. కానీ జోడేఘాట్ వెళ్లే మార్గంలో హట్టిఘాట్ నుంచి టోకెన్ మెవాడ్ వరకు సుమారు అయిదు కిలోమీటర్ల దూరం రెండు వరుసల రహదారి పనులు అటవీ అనుమతుల కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. సుమారు దశాబ్దం కావస్తున్నా.. ఇప్పటికీ అనుమతులు రాక


జోడేఘాట్ వెళ్లే మార్గంలో అటవీ అనుమతుల కారణంగా నిలిచిన రోడ్డు

అలాగే నిలిచిపోయింది. ఏటా భీం వర్ధంతి సమయంలో అధికారులు, నాయకులు త్వరలో చేస్తామంటూ కాలాయాపన చేస్తున్నారే తప్ప పరిష్కారానికి చొరవ తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆదివాసీల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

అటవీ అనుమతుల కోసం తప్పని పోరాటం..

అనుమతులతో సంబంధం లేకుండా పూర్తి చేయాలి

జోడేఘాట్ వెళ్లే మార్గంలో హట్టి నుంచి టోకెన్ మెవాడ్ మధ్యలో అటవీ అనుమతులు కారణంగా నిలిచిన రోడ్డు పనులను అటవీ అనుమతులతో సంబంధం లేకుండా పూర్తి చేయాలి. భీం వర్ధంతి సమయంలో మాత్రమే అధికారులు చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు. వర్ధంతి మరునాటి నుంచి పట్టించుకునే వారే ఉండరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పూర్తయ్యేలా చొరవ చూపాలి.

- పెందుర్ రాజేశ్వర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : లైంగిక దాడికి గురైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలికి కార్పొరేట్‌లో విద్య అందించాలని, కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తుండడంతో యువత మద్యానికి బానిసై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే వీటిని ఎత్తివేయాలన్నారు. పోలీసు, ఆబ్కారీ శాఖలు సమన్వయంతో వీటి నివారణకు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఎనిమిదో తరగతి విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన సహించరానిదని మాజీ ఎంపీపీ, భాజపా నాయకుడు అరిగెల మల్లికార్జున్ అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన న్యాయం జరిగేవరకు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ పెంటయ్య, సింగిల్ విండో ఉపాధ్యక్షులు ప్రహ్లాద్, నాయకులు గాజుల ప్రసాద్, సురేష్, సుబ్బారావు, మురళి, వినోద్, శ్రీనివాస్, లింగమూర్తి తదితరులున్నారు.

కనులపండువగా షిర్డీ సాయిబాబా జన్మదిన వేడుకలు

ఆలయంలో భక్తి పాటలు ఆలపిస్తున్న భక్తులు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా జన్మదిన వేడుకలను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. పగలు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సమయంలో వివిధ వార్డుల నుంచి భక్తజనం తరలివచ్చారు. భగవాన్ సత్యసాయి సేవా సంస్థ కాగజ్‌నగర్ కన్వీనర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో భక్తిగీతాలతో భజన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

వైభవంగా గ్రామ దేవతకు బోనాలు

బోనాలతో ఆలయం వద్ద మహిళలు

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల సందడి నెలకొంది. గ్రామ దేవత పోచమ్మకు ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకొని ఆలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

దేశాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రధాని ధ్యేయం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : దేశ ప్రధాని ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని భాజపా పట్టణ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొత్త పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి అంశాన్ని స్పృశిస్తూ పలు అంశాలపై మాట్లాడారని చెప్పారు. దేశాన్ని అగ్రగామిగా నిలపడమే ధ్యేయంగా మోదీ పాలన సాగుతోందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా గెలుపే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. వీరభద్రచారి, అరుణ్ లోయ, అనీల్, జాడి మధూకర్, మురళీకృష్ణ, తాటి వెంకటేష్, సంతోష్, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, తదితరులు

నిధుల మంజూరుకు కృషి: ఎమ్మెల్సీ

కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి ప్రహరీ నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ముందుగా బారేగూడ గ్రామానికి చెందిన రామగిరి జింగమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీ ఛైర్మన్ గణపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, టీపీసీసీ సభ్యుడు అర్షద్‌హుస్సేన్, నాయకులు నాహీర్‌అలీ, అశోక్, పెంటయ్య తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పోలీసు జట్టు విజయకేతనం

విజయ సంకేతం చూపుతున్న పోలీసులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు

కౌటాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం కౌటాల పోలీస్ జట్టు, కౌటాల ప్రెస్‌క్లబ్ మధ్య క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. సీఐ ముత్యం రమేష్ ప్రైండ్లీ క్రికెట్ మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రెస్‌క్లబ్ జట్టు 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. 17 పరుగుల తేడాతో పోలీసు జట్టు విజయం సాధించింది. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు మైదానంలో క్రికెట్ ఆడడంతో యువకులు ఉత్సాహంగా కేరింతలు చేస్తూ మ్యాచ్‌ను తిలకించారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు. కౌటాల, బెజ్జూరు ఎస్సైలు మధుకర్, విక్రమ్, విలేకరులు మారయ్య, నవీన్‌గౌడ్, అమోల్‌గౌడ్, మహేష్, నరేష్, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో గుర్తింపు సంఘ ఎన్నికలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎల్లగౌడ్‌తోటలో ఉన్న పద్మశాలి సేవా సంఘం రి.నెం.99/1990 ఎన్నికలను త్వరలోనే నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కుడిక్యాల రాజమౌళి, అనుమాండ్ల కేదారీ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో 30 సంవత్సరాలుగా మూడేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2022 జనవరి 2న ఎన్నికలు జరిగాయన్నారు. జిల్లా, రాష్ట్ర, అఖిల భారత పద్మశాలి సంఘానికి అనుబంధంగా కొనసాగుతోందన్నారు. త్వరలోనే పద్మశాలీలతో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శుల రాజీనామాలను జిల్లా కమిటీకి అందజేస్తామని, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో త్వరలోనే అధికారికంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వయోధికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మార్త సత్యనారాయణ

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణలోని వయోధికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వయోధికుల కార్యాలయంలో రాష్ట్ర, జిల్లాల నాయకులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఏడు సమస్యలపై జిల్లా పాలనాధికారులకు, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ పరిష్కారం కావడం లేదని తెలిపారు. పురపాలిక సంఘాల్లో డే కేర్ సెంటర్లు, కలెక్టర్ కార్యాలయంలో కౌన్సిలింగ్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

ఇన కెరమెరిలో భీం వర్ధంతిపై సమావేశం

కెరమెరిలో మాట్లాడుతున్న పెందుర్ రాజేశ్వర్, నాయకులు

కెరమెరి, న్యూస్‌టుడే : పోరుగడ్డ జోడేఘాట్‌లో అక్టోబర్ 17న పోరాట యోధుడు కుమురం భీం వర్ధంతి కార్యక్రమ ఏర్పాట్లపై అక్టోబర్ 1న కెరమెరి మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు భీం ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మాట్లాడుతూ.. భీం వర్ధంతి ఏర్పాట్లపై సమావేశంలో చర్చ ఉంటుందన్నారు. రాయిసెంటర్ సార్‌మేడిలు, తొమ్మిది తెగల ఆదివాసీ ఉద్యోగ, కార్మిక నాయకులు, గ్రామ పటేల్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ పెందుర్ మోతీరాం, ఆదివాసీ నాయకులు కోవ విజయ్, మడావి రాజు, రఘునాథ్, ఇందిర, కనక ప్రభాకర్, దంబిరావు, తదితరులున్నారు.

కార్మిక సంక్షేమమే ప్రధానం

మాట్లాడుతున్న కల్లోల భట్టాచార్య

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎస్పీఎం కార్మికుల జీవితాలతో పార్టీలు రాజకీయం చేస్తున్నాయని, రాజకీయాలకు దూరంగా ఉంటూ కార్మికుల కోసం పనిచేసేది కేవలం బీఎంఎస్ మాత్రమే అని ఆ సంఘం అనుబంధ ఎస్పీఎం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కల్లోల భట్టాచార్య తెలిపారు. సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు యూనియన్‌గా భారాస అనుబంధ సంఘం ఉన్న సమయంలో మిల్లు మూతపడిందన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం మిల్లు పునఃప్రారంభించినప్పటికీ స్థానికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. మిల్లులో నేటికీ 260 మందిని విధుల్లోకి తీసుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు. యాజమాన్యం 10 మంది కార్మికులతో రహస్యంగా అగ్రిమెంట్ జరిపిందని, కార్మికశాఖకు సైతం అగ్రిమెంటు కాపీ అందించలేదని ఆరోపించారు. మిల్లులో జరిగే కార్మిక వ్యతిరేక చర్యలను కార్మిక శాఖ పట్టించుకోకపోవడం వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని దుయ్యబట్టారు. ఎస్పీఎం ఎన్నికల్లో బీఎంఎస్‌కు అవకాశం ఇస్తే మెరుగైన వేతన ఒప్పందంతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గణపతి, జిల్లా కార్యదర్శి మోర్లె నానాజీ, సహ కార్యదర్శి అన్నం రాజన్న, దేవేందర్‌సింగ్, మార్కండేయులు, అరుణ్‌కుమార్, రాంశంకర్, చంద్రమౌళి, భీమయ్యలు పాల్గొన్నారు.

13న పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఎన్నికలు అక్టోబర్ 13న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు గడదాసు నారాయణ, డాసరి శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు అక్టోబర్ 2-4 వరకు నామినేషన్ల స్వీకరణ, 5న నామినేషన్ల పరిశీలన, 6న ఉపసంహరణ, అనంతరం తుది జాబితా విడుదల, 13న ఎన్నికలు, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. పట్టణంలో 3,610 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం ఆయా వార్డుల్లో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పద్మశాలి సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్న వారు పోటీ చేయడానికి అర్హులని, అధ్యక్ష స్థానానికి రూ.10 వేలు, ప్రధాన కార్యదర్శి స్థానానికి రూ.5 వేలు దరావత్తు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సందర్శించి.. అవగాహన కల్పించి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌ఆర్‌జేఎం సభ్యులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ మూవ్‌మెంట్ సభ్యులు తెలిపారు. ఆదివారం త్రిశూల్ పహాడ్‌పై ఉన్న పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన హక్కులను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం సౌకర్యాలు, భోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వస్తం ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇరవేని వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, గుండ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఒక్కచోట చేరి.. ఆడిపాడి

హైదరాబాద్‌లో ఆసిఫాబాద్‌వాసుల సందడి..

వార్షి క్రోత్సవంలో నూతన మహిళా ప్రతినిధులతో వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆసిఫాబాద్‌వాసులు ఏర్పాటు చేసుకొన్న శ్రీబాలేశ్వర పరిషత్తు ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని మూసాయిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆసిఫాబాద్ వాసులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, ఆసిఫాబాద్‌లో సబ్ కలెక్టర్‌గా పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ.గోపాల్ పాల్గొని ఆసిఫాబాద్‌తో అనుబంధాన్ని పంచుకొన్నారు. పలు అంశాలపై మార్గనిర్దేశనం చేశారు. పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించగా ఆసిఫాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు, భాజపా నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, సంఘసేవకులు ఉమేశ్ యాదవ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలేశ్వర సేవా పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పరిషత్ అధ్యక్షుడు వల్లపు అశోక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గాడిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముక్త వినేష్, కోశాధికారి ప్రేంసాగర్, మహిళా విభాగం అధ్యక్షురాలు దండనాయకుల లలిత, కార్యనిర్వాహక అధ్యక్షురాలు ముక్త ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగు..

పట్టణంలోని కాపువాడ రైల్వేస్టేషన్ సమీపంలో రహదారిపై మురుగు నీరు పారుతుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే క్వార్టర్లకు ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి ట్యాంకుల నుంచి రోడ్లపైకి వస్తుండడంతో తీవ్ర అసౌకర్యంగా ఉందని వాపోతున్నారు. దుర్వాసనతో భరించలేకపో